# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవిగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA-533 004**

గమనిక :- మీరు **M.O.** పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రెసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు


## క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - **80**, కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **7** ఫిబ్రవరి **1986** సంపుటి **6**


## సంపాదకీయము

### దయచేసి దేవుని సిగ్గు పరచవద్దు

### *(Please Don't Insult God)*

నీవెప్పుడైనా సిగ్గుపరచ బడ్డావా ? అయితే అదెంత అవమానకరమో నీకు తెలుసు. అవమానకరమైన మాటలు లేక చేష్టలు నీ యెడల ఎవరైనా చేసియుండవచ్చును. వారు నిన్ను గూర్చి ఏమనుకొన్నారో, లేక ఎంత హీనంగా తలంచారో అది నీకు తెలియజేసియుండవచ్చును. వారేమి చెప్పి చెయ్యకయుంటే చాల బాగుండును.

అది చెడ్డదని నీవనుకొనుచుయుంటే, దేవుని యెడల మానవుడు ప్రవర్తించే విధానము సంగతి యేమిటి ? అనేకులు ఆయనను నిరాకరించుదురు. ఆయనయందు నమ్మకముంచువారిలో ఎక్కువ శాతం ఆయన నామమును వ్యర్థముగా ఉచ్ఛరిస్తారు. అసభ్యకరమైన మాటలతోబాటు వారాయన నామమును కూడ వల్లిస్తారు. ఆయన వారిపై కుమ్మరించిన దీవెనలకు కృతజ్ఞత చెల్లించకుండా ఎంత మంది భోజనం చేయుట లేదు ?

ఆయన ఆజ్ఞాపించినవి చేయకుండా వారి కోరికలను ఆశలను ముందుంచుటద్వారా అనేకులు ఆయనను సిగ్గుపరుస్తారు. ఆ విధంగాను ఈ విధంగాను రక్షింపబడవచ్చని చెప్పేవారి సంగతి ఆలోచించు. అన్ని రకాలైన సంఘాలలో యుంటూ దేవుని నామముకంటే మానవుని నామానికి ప్రాధాన్యత యిచ్చువారి సంగతి యేమిటి? పరలోకానికి అనేక మార్గాలున్నాయని, మన యిష్టంవచ్చినట్లు దేవుని ఆరాధించవచ్చునని, సంఘాలన్నీ మంచివే యని వారు చెబుతారు. దీనంతటిని గూర్చి దేవుడేమనుకొనుచున్నాడు? ఇది దేవుని సిగ్గుపరచడం కాకపోతే, మరేమిటి?

దీనంతటిలోను నిజానికి దేవుడు తన కక్కర లేదని, తన యిష్టమొచ్చినట్లు ప్రవర్తించి పరలోకానికి వెళ్లగలనని మానవుడు చెబుతున్నాడు. దేవుని మార్గమువలె తన మార్గము మంచిదేనని అతడు గొప్ప చెప్పుకొనుచున్నాడు. మానవుడట్లు ఆలోచించడం ఎంత విచారం, ఎంత బుద్ధిహీనత! ఒకరోజున అతని మోకాలు వంగును అతని నాలుక దేవుని ఒప్పుకొనును (రోమా 14 : 11).

ఒకని తమ మతములో కలుపుకొనుటకు కొందరు సముద్రమును భూమిని చుట్టివచ్చెదరు; అతడు కలిసినప్పుడు అతని వారికంటె రెండంతలు నరకపాత్రునిగా చేయు వారిని గూర్చి క్రీస్తు చెప్పాడు (మత్త 23 : 15). తాము తప్పులోయుండి తమ తప్పులోనికి మనుష్యులను మార్చువారిని గూర్చి ఆయన చెప్పాడు. అట్టి సందర్భములో వారికి సత్యము బోధింపబడుట కష్టము. గనుక వారికంటె వీరు నిత్యనాశనమునకు గురిఅయ్యే అవకాశమున్నది.

మరియొక సందర్భములో మనుష్య కుమారుని అప్పగించుటకంటె అట్టివాడు పుట్టియుండని యెడల వానికి మేలని ఆయన చెప్పాడు (మత్త 26 : 24).

సత్యము నెరిగిన తరువాత దేవునికి అపనమ్మకముగా యుండుట కంటే సత్యము నెరుగకుండుటయే మేలని పేతురు ప్రకటించాడు. అతడు ఇట్లన్నాడు : "వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానముచేత ఈలోక మాలిన్యములను తప్పించు కొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటిచేత జయింపబడిన యెడల, వారి కడవరిస్థితి మొదటిస్థితి కంటె మరి చెడ్డదగును. వారు నీతిమార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింప బడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుట కంటె ఆమార్గము అనుభవ పూర్వకముగా తెలియక యుండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగినట్లును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లి నట్టును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను" (2 పేతురు 2 : 20-22).

అంతేకాదు. ప్రభువువారై యుండి కూడ అప్పుడప్పుడు మాత్రమే ఆరాధనకు వెళ్లువారి సంగతి యేమిటి? లేదా వారికి సమీ పముగాయున్న మతశాఖల ఆరాధనకు వెళ్లువారి సంగతి యేమిటి ? అది దేవునికి ఎంత సిగ్గుకరము! మన మాయన వారమని ఆయన ఎట్లు చెప్పగలడు ? చెప్పలేడు, సరిగదా మనలను గూర్చి ఆయన సిగ్గు పడును. ఆయన బిడ్డలు అట్లు ప్రవర్తించుట ఆయనకు చాల బాధకరము.

అదే సిగ్గుకరమని నీవనుకొనుచున్న యెడల కానుక లిచ్చు సమయంలో ప్రభువుకు యాభై లేక వందరూపాయలు ఇయ్యగలిగిన వాడు పదిపైసలు లేక అర్ధరూపాయి లేక రెండురూపాయలు మాత్రమే ఇచ్చుచుండిన యెడల, వాని సంగతియేమి ? యిది చాలమంది చేయుచున్న సంగతే. యిది వట్టి వేషధారణయే. నేను ప్రభువును ప్రేమించుచున్నానని అతడు చెప్పుచున్నాడుగాని ప్రభువు అతన్ని బాగా ఎరుగును. అంత కొద్దిమొత్తమును ఇచ్చుట కంటే ప్రభువుకు

ఏమి ఇయ్యకపోతే మేలు. నీవు క్రైస్తవుడిగా యుండగోరిన యెడల ఇచ్చుటను గూర్చి తెలుసుకో, బైబిలు బోధించురీతిగా ఇయ్యి. మనము ప్రతి ఆదివారమున ఇయ్యాలని, మనం అభివృద్ధి చెందినకొలది హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యాలని, సంతోషముతో ఇయ్యాలని పౌలు చెప్పాడు (1 కొరింథీ 16:1,2; 2 కొరి 9:6). మనమియ్యవలసినరీతిగా ఇచ్చినప్పుడు, మన ప్రభువు మనలను తప్పక దీవిస్తాడు. అట్లుగాక ఒకటి రెండు రూపాయలను ఆయనకు యిస్తే, మనలను ఆయన ఎట్లు దీవిస్తాడు ? ఆయన దీవించలేడు, దీవించడు. అట్టి విషయములో మన మాయనను సిగ్గుపరచుచున్నాము. మన మాయనను ఆయన ఆజ్ఞాపించిన దానిని హేళన చేయుదుము. అట్టి అవిధేయతను దేవుడు తక్షణమే శిక్షించుట లేనందున మనము జాగ్రత్త కలిగియుండుట శ్రేష్టము.

మన తండ్రియైన దేవుని యొద్ద వంగి ప్రభువా, ఆజ్ఞాపించుము, నేను నీకు లోబడుదునని మనము చెప్పాలి; అట్లు చేయాలి. మనము ప్రభువు యెడల భక్తి కలిగి, ఆయన వాక్యమును గౌరవించి, ఆయన చిత్తానికిలోబడి నప్పుడు మాత్రమే ప్రభువు మనలను రక్షించి దీవిస్తాడు. నీవు ప్రభువుకు సమర్పించుకో, ఆయన నీకేమి చేయగలడో ఆయననే కనుబరచనియ్యి. ఎక్కువ కలిగియున్న మీరు ఎక్కువ ఇయ్యండి. నీవు సరియైన మనస్తత్వము కలిగి, సదుద్దేశము కలిగి చేసిన యెడల, నీ వేమి పోగొట్టుకోవు గాని సంపాదించుకొంటావు.

మనమీ జీవితంలో ఏమిచేసినను, దేవుని మాత్రం సిగ్గుపరచకుండా జాగ్రత్తపడాలి. ఈ జీవితంలో మనం చెప్పిన దానికంతటికీ, చేసిన దానికంతటికీ ఒకానొక దినమందు ఆయనకు జవాబియ్యవలసియుండునని జ్ఞాపకముంచుకోవాలి. ఆ సమయమందు ఆయనకు విధేయుల మయ్యామని, జీవితమంతా నమ్మకముగా ఆయనకు పరిచర్య

చేసి ఆరాధించామనే నమ్మకముతో ఆయన సన్నిధిని మనము ప్రవేశించగోరాలి. ఈనాడే మనమాయనను కలసికొనవలసివస్తే, ఇట్టి నమ్మకముతో ఆయనను కలసికొనగలమా? లేనియెడల సరిచేసుకొనే సమయం యిదే. లేనైతే చాల ఆలస్యమైపోతుంది.

---

## బైబిలు యొక్క దివ్యప్రేరణ

## *(The Inspiration of the Bible)*

క్రైస్తవులు బైబిలు నెందుకు వినియోగిస్తారు? మిగతా మత గ్రంథములు దానితో సాటియైనవని మనం ఎందుకు అంగీకరించము? దేవుడు మానవుని కిచ్చిన లిఖితపూర్వక బయల్పాటు బైబిలు ఒక్కటి మాత్రమే యని క్రైస్తవులు ఎందుకు చెబుతారు? హిందువుల యొక్కయు, ముస్లిముల యొక్కయు, బౌద్ధులయొక్కయు లేఖనాలను మనం ఎందుకు అంగీకరించము?

బైబిలు ఒక్కటి మాత్రమే దేవుని లిఖిత వాక్యమని క్రైస్తవులు చెప్పుటకు అనేక ఋజువులు, ఆధారములు ఉన్నవి. ఈ క్లుప్త వ్యాసములో మనము ఒకే ఒక్క వాదమును చూచుకొందము. బైబిలులో తప్పులున్నాయని మానవులు తలంచారు గాని బైబిలే సత్యమని తేలిన సందర్భములను పరిశీలిద్దాం.

1800 సం॥ల కాలములో, పాత నిబంధనలోని మొదటి ఐదు పుస్తకములను మోషే వ్రాసియుండడని మానవులు తలంచారు. మోషే కాలము నాటి ప్రజలకు వ్రాయడం యేమీ తెలియదని వారి వాదన. అయితే అటు తరువాత మోషే కంటే ముందు కాలమునాటి గ్రంథాలయములను పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పంచ కాండములను మోషే వ్రాసాడనే సంగతిని కొందరు ఇప్పటికీ అంగీకరించరు,

గాని మోషేకు వ్రాయడం తెలియదని మాత్రం వారు చెప్పడం మానేసారు.

బైబిలులో తప్పువలె కనబడు మరియొకటి ఆదికాండము 13వ అధ్యాయములో యున్నది. అబ్రహాము, లోతులు తమ తమ మార్గములలో వేరై పోగా ఆమైదాన ప్రదేశమందున్న పట్టణముల వైపు లోతు వెళ్లాడు. ఇది తప్పని కొందరన్నారు. ఆకాలమందున్న మైదాన ప్రదేశంలో పట్టణా లేమీ లేవని వారన్నారు. ఆమైదానప్రదేశంలో జనసాంద్రత బహు స్వల్పమని వారన్నారు. అయితే నెల్సన్‌గ్లూక్ అనే పురావస్తు శాస్త్రవేత్త ఆమైదాన ప్రదేశమును తరచి, త్రవ్వగా అతడు 70 పట్టణములను వాటిలో కొన్ని క్రీ॥ పూ 3000 సం॥లకు పైగా యున్నట్లును సాక్షాధారములను కనుగొన్నాడు, మరల, బైబిలులో తప్పనుకొన్నది తప్పు కానేకాదు.

దానియేలు గ్రంథములో బైబిలులో మరియొక పొరబాటువలె యున్నది అగుపడును. బబులోను రాజులలో బెల్షస్సరు ఆఖరివాడని బైబిలు దానియేలు గ్రంథములో చెప్పుచున్నది. బబులోను రికార్డులు నాబోనియస్ అనునతడు ఆఖరి రాజని చెప్పుచున్నందున ఇది తప్పని కొందరన్నారు. అయితే నాబోనియస్ అనునతడు తన ఏలుబడి చివరిభాగంలో, రాజ్యాన్ని ఏలుటకు తన పెద్ద కుమారుడైన బెల్షస్సరుకు అప్పగించి అరేబియాలో విశ్రాంతి తీసికొనుటకు వెళ్లెనని తరువాత కనుగొనబడినది. అట్లు బైబిలు నిజానికి తప్పులో యేమీ లేదు.

బైబిలులో పితరులను గూర్చిన సంగతులలో చాల కట్టు కథలని అనేకులు ఒకప్పుడు చెప్పేవారు. అబ్రహాము, ఇస్సాకు, యాకోబులను గూర్చిన ఆధారములు యేమీ లేవని వారనుకొనేవారు. అంతే గాక వారి కథలలో కనబడే ఆచారములు మరెక్కడా కనబడలేదని, అందువలన అవి కల్పితాలని ఆరోపించేవారు. అయినను సరే అబ్రె

హాము, ఇస్సాకు, యాకోబుల ఆచారములు నాచరించిన జనాంగము లను సంస్కృతిని పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అంతేగాక, వారివంటి పేర్లనే కలిగి యుండిన యితర ప్రజలను గూర్చికూడ బయటపడింది. ఇప్పుడు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల సంగ తులు కల్పితములని ఏ బైబిలు విద్యార్థి చెప్పలేడు.

యెషయా 20:1లో బైబిలులో తప్పువలె కన్పడునది మరి యొకటి ఉన్నది. ఇక్కడ సర్గోను అను ఒకని గూర్చి మనము చదువ గలము. ఇక్కడ తప్ప పురాతన సాహిత్యములో అతని పేరు ఎక్కడా కనబడుటలేదు. బైబిలు ఇక్కడ పొరబడిందని చాలమంది తలంచారు. గాని 1824లో ఖొర్సాబాదులో సర్గోను భవనాన్ని పురావస్తు శాస్త్ర వేత్తలు కనుగొన్నారు. వారతని రాజ్యరికార్డుల ద్వారా అతడు క్రీస్తు పూర్వము 722 నుండి 705 వరకు రాజై యుండెనని కనుగొన్నారు. అష్షూరు రాజులలో ప్రఖ్యాతి గాంచిన వారిలో అతడొకడు.

లూకా 3:1లో "అబిలేనే దేశమునకు లుసానియ అధిపతిగా యున్న కాలమున" బాప్తిస్మమిచ్చు యోహాను వాక్యప్రకటన నారం భించెనని తెలియజేయబడింది. ఇది చాలకాలము వరకు ఒక పొర బాటని భావించబడింది. ఏలయనగా లుసానియ యనువాడొక రాజు గాని చతుర్థాధిపతి ఎన్నడు కాదు. సరిగదా బాప్తిస్మమిచ్చు యోహాను పుట్టక చాల కాలముముందు క్రీ॥ పూ॥ 36వ సంవత్సరములో అతడు చంపబడెను. అయితే అబిలేనే ప్రాంతములో ఒక శిలాలేఖనము కను గొనబడింది. దానిలో క్రీ॥ శ 14 నుండి 29 వరకు పాలించిన లుసా నియ యను చతుర్థాధిపతిని గూర్చి చెప్పబడినది. మరియొకసారి బైబిలే రైటని తేలినది.

అనేకమైన యితర ఉదాహరణలను ఇయ్యవచ్చును, మరియు బైబిలును గూర్చి క్రైస్తవ్యాన్ని గూర్చి అనేక ఋజువులను ఇయ్య

వచ్చును. క్రైస్తవులు బైబిలును దేవుని వాక్యమని ఎందుకు అంగీక రింతురో ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అది ఆయన లిఖించి యిచ్చిన బయల్పాటు. ఆయన చిత్తాన్ని గ్రహించుటకు మానవుడు దానిని పఠించుచు యుండాలి.

— స్టీవ్ విలియమ్స్

---

## బోధకుడి బాధలు

యేసు దివ్య సువార్తను బోధించటంకన్నా గొప్ప పని ఈ భూమి మీద మరేదీ లేదు (రోమా 10:15). సువార్త సేవకుని పని కంటే కష్టమైనది, త్యాగమైనది మరో వృత్తిలేదు (2 తిమో 1:11-12). దేవుని సేవకుని కంటే మరెక్కువగా సాతాను చేత ద్వేషించబడేవాడు లేడు. ఆ దుష్టుడు బోధకుని పని చెడగొట్టడానికి, బోధకుని నిరుత్సాహ పరచటానికి ఉపయోగించని మాయోపాయం లేదు (2 కొరి 2 : 11). క్రీస్తుసేవలోనికి వచ్చిన ప్రతి మనిషీ అది ఎంత భారమైనదో, ఎంత పోరాటంతో కూడుకొన్నదో తెలిసికోవాలి. దాని విలువ ఎంతో లెక్కచూచుకొని సిద్ధపడాలి (లూకా 14:28-33). బోధకుడిపై ఉండే అదనపు భారాలు :-

1. సహకరించని గుంపుతో పనిచేయటం : చాలామంది సువార్తికుని నాయకత్వానికి ఒప్పుకోరు. అతని పనుల్లో సహకరించరు. తాను బోధించే ప్రజలనుండే బోధకుడు విమర్శల నెదుర్కోవలసి వస్తుంది. కొరింథీ సోదరుల ప్రవర్తన అలానే వుంది (2 కొరింథీ11:7-9). పాపంతో జరిగే పోరాటంలో సంఘు సభ్యులు బోధకుని విడిచిపెట్టి పారి పోవటం మరింత బాధాకరం (మార్కు 14:50, 2 తిమో 4:16). బోధ కుని బోధను మెచ్చుకోవక పోవటం, అతని అవసరాలు తీర్చక పోవటం కూడా అతనికి బాధలే. దేవుని సత్యాన్ని బోధించిన వ్యక్తికి కనీస కృతజ్ఞత చూపటం ధర్మం (అ.కా. 20:27).

2. సహకరించని సంఘపెద్దలు :- పెద్దలొక మనుష్యుని బోధకునిగా నియమిస్తారు, మందను చూస్తుంటారు. బోధకుడు తన పనిని పెద్దల పనిని గూడా చేయాలంటారు. అది చాలా కష్టం. అది దేవుని పద్ధతికి విరుద్ధంకూడా. శరీరానుసారులు బోధకుని ఎదిరిస్తే ఈ పెద్దలు అండగా నిలబడరు (2 తిమో 4:1-3). అహరోను హూరులు మోషే చేతులను ఆదుకొనినట్లు ఈ పెద్దలు బోధకుని ఆదుకోవాలి (నిర్గమ 17 : 12).

3. సహకరించని భార్య :- దైవికమైన, నమ్మకమైన, గుణవతియైన భార్య సహకారంలేనిదే ఏ వ్యక్తి క్రీస్తుకోసం సరిగా పని చేయలేడు. భార్య సహకరిస్తే బోధకుని పనిహాయి. కాని ఎంతోమంది భార్యలు బోధకులకు సహాయపడరు. పైగా బోధకుని వ్యతిరేకిస్తారు. భార్యల అసహ్యప్రవర్తననుబట్టి అవమానించబడిన బోధకులెందరో వున్నారు. యేసును ప్రేమించి, పరలోకం చేరాలనే ప్రతి బోధకుని భార్య నిశ్చయంగా అతనికి సహకరిస్తుంది. బలహీనమైన ఘటంగా గుర్తించి గౌరవించితే, ప్రతిభార్య తిరిగి గౌరవిస్తుంది (1 పేతు 3:5-7). యోగ్యురాలు తన పెనిమిటికి కిరీటము. సిగ్గు తెచ్చునది వాని ఎముకలకు కుళ్ళు (సామె 12:4).

ముగింపు :- సువార్త బోధకులు తక్కువగా ఉన్న రోజుల్లో మనం ఉన్నాము కాబట్టి మనం బోధకులకు భారంగా తయారు కాక, వారి భారాలను మోసేలా ఉందాం !

— జాన్ వాడ్

# బైబిలు అంతయు ఆత్మావేశముగల వాక్యమని అది నమ్ముచున్నది

## (*It believes all the Bible to be the Inspired Word of God*)

## బైబిలును నమ్ముటకు గల కారణములు

బైబిలును నమ్మడానికి గల అనేక కారణాలలో కొన్నిటిని గమనించుము :

**1.** బైబిలు గనుక యథార్థము కాకపోతే, నమ్మకమైన ఆమోద యోగ్యమైన చరిత్ర యేమీ లేదు. మరియే చరిత్రకూడ అట్టి నిష్కళంకమైన విశ్వసనీయమైన లక్షణములను కలిగియుండలేదు. బైబిలుయొక్క యథార్థత ప్రతిచోట కనబడుచునే యున్నది. క్రీస్తును గూర్చి చెబుతు, "... మేమేది వింటిమో, కన్నులార ఏది చూచితిమో, ఏది నిదానించి కనుగొంటిమో, మా చేతులు దేనిని తాకి చూచెనో అది మీకు తెలియజేయుచున్నాను" అని వ్రాయబడి యున్నది ( 1 యోహాను 1 : 1). దాని ఋజువు వదంతులు కాదు ; వారు చూచారు, విన్నారు, తాకారు, జ్ఞానయుక్తంగా నిదానించి అంగీకరించారు. వారు క్రీస్తును విని, చూచి, తాకారు గనుక వారి కనుదృష్టి, వినకిడిశక్తి, స్పర్శజ్ఞానము తక్కువని చెప్పి నిరాకరించడానికి వీలులేదు. నిష్కళంక దృష్టితోను, సత్యవాదిత్వముతోను చూచిన యెడల వారి సాక్ష్యము అంగీకార యోగ్యమైనది. వారి నిష్కాపట్యాన్ని ప్రశ్నించినా లేక వారు అబద్ధమాడారని నిందించినా అది హాస్యాజనకమవుతుంది. ఈసాక్ష్యము ఇచ్చుటవలన వారికి భౌతిక లాభం యేమీ కలుగలేదు. గాని దానికొరకు మిత్రులను, ఇండ్లను, సుఖజీవితాన్ని పోగొట్టుకొనుట జరిగింది. హింసలను మరణాన్ని పొంద

వలసివచ్చింది. అసత్యమైనదని ఎరిగిన దానినిగూర్చి మానవుడు తన ప్రాణాన్ని సహితము కోల్పోతాడని చెప్పడం న్యాయవిరుద్ధం. నిష్కాపట్యాన్ని గూర్చి వారిచ్చిన బలమైన ఋజువుల కంటే మరియే చరిత్రకారుకు ఎక్కువ ఇయ్యలేదు. బైబిలు యథార్థము కాకపోతే మనకంగీకార యోగ్యమైన చరిత్ర యేదీ లేదు.

"కళలలో నైపుణ్యత లేనివారు, వివిధ కాలాల్లో, స్థలాల్లో జన్మించిన మానవులు అట్టి ఏకీభావం గలిగిన సత్యాలను పరమునుండి గాక మరింకెట్లు అల్లగలిగారు? లేదా వారంతా మనల్ని మోసగించడానికి ఎందుకు కుట్ర పన్నాలి? వారి సలహాలు మన్నన చేయబడకపోయినను హింసలకు తల ఒగ్గి, ఆకలికి మాడి చివరకు హతసాక్షుల మూల్యాన్ని చెల్లించారు".

2. బైబిలు సంఖ్యలో అరవై ఆరు పుస్తకముల గ్రంథము. గాని వాటంతటిలోను ఒకే భావమున్నది. పదహారు వందల సంవత్సరాల్లో ఇంచుమించు నలభై మంది లేఖకులచే లిఖించబడింది, గాని అకస్మికంగా వ్రాయబడి యుండలేదు. ఈ మనుష్యులు చరిత్రయొక్క వివిధ కాలాల్లో జీవించారు. వివిధ వృత్తుల నవలంబించారు, వివిధ ఆచారములు, ప్రభుత్వములు, భౌగోళిక ప్రదేశాలలో జీవించారు. వారు వివిధ కాలాల్లో, వివిధ పరిస్థితుల్లో జీవించారు, ఒకరినొకరు ఎరుగకుండానే వ్రాసారు. గనుక భక్తిగల వంచన నొక దానిని వ్రాయడానికి వాళ్ళంతా కుట్రపన్నుట అసంభవము. అయితే వారి కృషి నంతటిని జమాచేస్తే ఆదినుండి అంతమువరకు గొప్ప ఏకీభావము, సంఘీభావము గల గ్రంథము మనకున్నది. ఇది ఆకస్మికంగా సంభవించినది కాదు. అది మానవాతీతమైనది, దాని సంకల్పము దైవికం, అద్వాక అత్యున్నత శక్తియొక్క కృషి: బైబిలు అకస్మికంగా కలిగిన దనుటకంటే, వందల కొలది మనుష్యులు తమ సొంత సంకల్పమును బట్టి, సంఘీభావము లేని నమూనా యేమీ లేకుండగా పనిచేస్తే ఎంపైర్

ఎన్టేటులాంటి గొప్ప భవనం అకస్మాత్తుగా తయారయ్యిందని వాదించుట శ్రేష్టము.

8. వివిధ వృత్తులు, సాధనాలు, శక్తి సామర్థ్యములు కలిగిన ఈ మనుష్యులు అట్టి మహనీయమైన, ఏకీభావముగల గ్రంథాన్ని వ్రాసారనునది, ఈ "మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" యనుట కొక గొప్ప ఋజువై యున్నది (2 పేతురు 1:21). ఉదాహరణకు మోషే ఐగుప్తీయుల జ్ఞానంలో విద్య నభ్యసించాడు, ఒక గొర్రెల కాపరి, నాయకుడు; యెహోషువ ఒక సైనికుడు, వేగులవాడు; ఎజ్రా ప్రఖ్యాతిగాంచిన శాస్త్రి, భక్తిగల యాజకుడు; నెహెమ్యా రాజుయొక్క పానదాయకుడు; దావీదు గొర్రెల కాపరి, సంగీతకారుడు, యుద్ధ వీరుడు, రాజు; సొలొమోను భూమిమీదనున్న వారందరిలో జ్ఞాని, పరాక్రమశాలి యైన రాజు; యెషయా ఒక ప్రవక్త, యెహెజ్కేలు పరవాసములో యున్న యూదుడు; దానియేలు ఒక రాజనీతి నిపుణుడు; ఆమోసు ఒక గొల్లవాడు, రైతు; మత్తయి పన్నులు వసూలుచేసే సుంకరి; పేతురు యోహానులు జాలరులు, "విద్యలేని పామరులు"; లూకా ఒక వైద్యుడు; పౌలు డేరాలు కుట్టువాడు, గమలియేలు పాదములయొద్ద నేర్చుకొనిన పండితుడు. తమ వృత్తిలోను, సామర్థ్యములోను, ఇంత వేరుగాయున్న అనావేశ మానవులు "మాధుర్యమైన తేనెపట్టు, పదునుపెట్టబడిన ఆయుధముల ఆయుధాగారము, ఈ విశ్వపు కిరీటములోయున్న ఆభరణముల ఖజానా, దీపము లన్నింటిని వెలిగించు దివ్వె, సమస్త వైభవాలకు, మహిమలకు ఆలవాలయము, పరలోక ప్రవేశానికి ముందున్న మెట్టు" వలెయున్న ఒక గ్రంథాన్ని వ్రాసి యుండలేరు. ఈ గ్రంథం తరుచు ప్రశ్నింపబడుచున్నదే గాని ఎన్నడు నిరాకరించబడలేదు. అది ఒక ఆకస్మికముగా కలిగిన పనికాదు. అది తప్పక దేవుని పనియైయున్నది.

4. బైబిలు యథార్థం కాకపోతే సత్యముకంటే ఈ లోకానికి అసత్యమే ఎక్కువ విలువగలిగినదౌతాది. అది సత్యము కాకపోతే, అసత్యము; అయినను మానవుని ఉన్నతునిగా జేయడానికి నాస్తికులు, నిర్దేవులు, అజ్ఞాతివాదులు, సంశయశీలులు, మొదలగువారు అందరు చెప్పిన మాటలన్నిటి కంటె ఎక్కువ అది చేసింది. నాగరికత వికసించడానికి బైబిలు ఎల్లప్పుడు మార్గము సరాళము చేయుటలో గొడ్డలివలె పనిచేసింది. అది ఎల్లప్పుడు మానవతత్వాన్ని శుద్ధిచేసిన శక్తి. నీతి సద్వర్తన, సహోదరత్వముగలవారు దాన్ని సత్యమని అంగీకరించారు. గనుక బైబిలు సత్యం కాకపోతే ఈలోకం సత్యంకంటే అసత్యంతోనే మేలుపొందినదవుతాది.

5. బైబిలు యథార్థం కాకపోతే ప్రకృతి పనిచేయుట వ్యర్థం. "భూనివాసులలో ఒక తరగతివారున్నారు. వారి సౌకర్యముకొరకు మిగిలిన జీవరాసులన్నీ యున్నాయి. మానవుడే ఆ తరగతివాడు. అతడు నశించిపోతే, నిత్యము నశించిపోతే సమస్తము నాశనమైపోతాది. కాయగూరల పంటలు ప్రతి సంవత్సరము భూమిలోనుండి ఉద్భవించి మరల దానికే తిరిగి వెళ్తాయి. వివిధ జాతుల జంతువులు వాటిని భుజిస్తాయి, మరణిస్తాయి. అవి వాటి ఆహారమువలె భూమిని సారవంతము జేస్తాయి. రేయింబవళ్లు ఒకదాని తరువాత మరొకటి వస్తాయి. సంవత్సరాలు తరబడతాయి. భూమి దాని యిరుసుపై చలిస్తూ దాని కక్ష్యలో గుండ్రముగా తిరుగుచు దానిపైనున్న వాటన్నిటికి ఆహారము నిస్తాది, అందరినీ భూస్థాపన చేస్తాది. మానవుడు కూడ తన ఆహారమువలె నశిస్తాడు.

"దీని యంతటివలన కలిగిన లాభమేమిటి? మానవుడు తిరిగి జీవించకపోతే, బైబిలు యథార్థం కాకపోతే, ప్రకృతి పనిచేయడం వ్యర్థం. మరియు సృష్టికర్త అంటూ ఒకడుంటే, ఆయన ఒక సంకల్పము లేకుండా పనిచేస్తే, ప్రయోజనం లేకుండా ప్రయాసపడితే... బైబిలు

యథార్థం కాకపోతే, మానవుని చరిత్రను సృష్టిని, పతనాన్ని, పునః ప్రతిష్టనుగూర్చి అది చెప్పునది సత్యం కాకపోతే, ఒక్క మాటలో సువార్త అబద్ధము, బైబిలు అసత్యము అయితే, సజీవుడైన మానవు డెవడు మన గ్రహము ఎందుకు ఉనికి కలిగియున్నదో సరియైన కారణ మియ్యలేడు" (Christian Baptism, Campbell). బైబిలు సత్యం కాకపోతే మానవుకు ప్రయోజన శూన్యంగా జీవించుచున్నాడు, ప్రకృతి ఒక భయంకర విఘాతము మరియు ఈ విశ్వసంకల్పమంతయు ఒక గొప్ప ఆశాభంగము.

6. ఇతర గ్రంథములలో కనబడని బైబిలుయొక్క ఒక విశేష గుణం యేమంటే దాని ఉచ్చరణలో అది అధికారపూరితమైనది. "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు" రెండువేలసార్లు కనబడు చున్నది. అది దేవునినుండి కలిగినదానినని చెప్పుకొనుచున్నది. అది చెప్పు మాటలు దాని గ్రంథకర్తయైన దేవుని అధికారముపై సంపూ ర్తిగ ఆధారపడియున్నవి. మానవ లేఖకులు సంశయాన్ని అనుమా నాన్ని కలిగియుంటే బైబిలు రూఢిగా, నిష్కర్షగా యున్నది. గతాన్ని గూర్చి ఎంత స్పష్టంగా చెప్పిందో భవిష్యత్తునుగూర్చి కూడా అది అట్లే చెప్పుచున్నది. ఇది మానవ కృతములనుండి దానిని వేరు చేయు చున్నది.

7. బైబిలు పక్షపాతముగలది కాదు గనుక మానవ గ్రంథము లకు వేరుగా యున్నది. అత్యున్నతస్థాయిలో మానవుడు వర్ణించ బడినా, అతడు కారుచీకటిగల పాపములు చేసినట్లు కూడ చెప్పబడింది. ఉదాహరణకు : దావీదు దేవుని హృదయసంబంధి యని చెప్పబడింది; కాని అతడు వ్యభిచారి యని నరహంతకుడని కూడ చెప్పబడింది. మానవులు ఏకపక్షానుకూలమైన చరిత్రను వ్రాస్తారు. మిత్రుడైతే అతని పాపములు సంకుచితంచేసి, సద్గుణాలను బహుగా పొగడ్తారు. శత్రువైతే అతని పొరబాట్లను అధికంచేసి, సుగుణాలను సంకుచితం

చేస్తారు. కాని బైబిలుయొక్క ప్రత్యేకత యేమంటే అది నిజముగా పక్షపాతి కాదు. ప్రతి మానవునిగూర్చి ఉన్న సత్యాన్నంతా అది చెబుతుంది. మానవ కృతములనుండి ఎంత భిన్నముగా యున్నదో!

3. దాని ప్రవచనముల నెరవేర్పునుబట్టి బైబిలు తప్పక దేవుని వలన కలిగినదై యున్నది. అనేక అంశములను గూర్చిన అనేక ప్రవచనాలను మనం ఉదాహరణగా వాడవచ్చును. గాని క్రీస్తును గూర్చిన కొన్నింటిని మనం గమనిద్దాం :

1) క్రీస్తు ఒక కన్యకు జన్మించునని ప్రవచింపబడినది (యెషయా 7:13, 14). అది నెరవేరింది (లూకా 1:26-35),

2) క్రీస్తు బెత్లెహేములో జన్మించునని ప్రవచింపబడింది (మీకా 5:2). అది నెరవేరింది (మత్తయి 2:1-11).

3) ప్రభువుకు ఒకడు ముందుగా వచ్చి మార్గము సరాళము చేయునని ప్రవచింపబడింది (యెషయా 40:3; మలాకీ 3:1, 2). ప్రవచింపబడిన రీతిగా అది నెరవేరింది (యోహాను 1:22, 23; మార్కు 1:1-7).

4) యేసు యెరూషలేముకు 'గాడిదను గాడిద పిల్లను ఎక్కి' వచ్చునని ప్రవచింపబడింది (జెకర్యా 9:9, 10). అది నెరవేరింది (మత్తయి 21:1-9).

5. మన రక్షకుడు తన హితులలో ఒకనిచేత అప్పగింపబడునని ప్రవచింపబడెను (కీర్తన 41:9). అది యిప్పుడు నెరవేరిపోయిన చరిత్ర (మార్కు 14:43-49).

6) ఆయనను అప్పగించువాడు ముప్పది వెండి నాణెములకు అప్పగించునని, ఆ ద్రోహి ఆ సొమ్మును తిరిగి ఇచ్చివేయునని ప్రవచింపబడినది (జెకర్యా 11:12, 13). అది నెరవేరిపోయిన రికార్డుగా మన కున్నది (మత్తయి 27:3-10).

7) ఆయనను కొరడాదెబ్బలు కొట్టుదురని, అపహసించుదురని ప్రవచింపబడెను (యెషయా 50:6). అది యిప్పుడు చరిత్ర (యోహాను 19:1; మార్కు 14:65; మత్తయి 27:27-31).

8) యేసు ఒక గొర్రెపిల్లవలె మౌనముగా శ్రమననుభవించునని యెషయా ప్రవచించాడు (యెషయా 53:4-7). ఆ ప్రవచనము అక్షరాల నెరవేరింది (మార్కు 15:2-5).

9) కీర్తన 22:18లో, "నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు, నా అంగీకొరకు చీట్లు వేయుచున్నారు" అనియున్నది. చెప్పబడిన రీతిగానే అది జరిగింది (యోహాను 19:23,24).

మెస్సీయనుగూర్చి చెప్పబడి నెరవేరిపోయిన ప్రవచనము లెన్నిటినో మనం ఇంకా ఇయ్యవచ్చునుగాని, యివి సరిపోవును. అయితే మనమే దాని నెరవేర్పుకు సాక్షులుగా యున్న మరొక ప్రవచనాన్ని బహుశ మనం చూపించవచ్చును. కొందరు విశ్వాస భ్రష్టులై ఒక విధమైన మతాన్ని స్థాపిస్తారని, దానిలో వివాహమును కొన్ని రకములైన మాంసములను నిషేధిస్తారని పౌలు ప్రవచించాడు (1 తిమో 4:1-3). రోమన్ కేథలిక్కు సంఘము ఈ ప్రవచనాన్ని నెరవేర్చింది. కొందరు వివాహమాడరాదని వారు నిషేధిస్తారు. వారి సభ్యులు కొన్ని దినాల్లోను, కాలములలోను కొన్ని రకాలైన మాంసములు తినరాదని వారు నిషేధిస్తారు. యిది ఇలా జరుగుతాదని పౌలు ఎట్లెరుగును? అతడు పరిశుద్ధాత్మవలన నడిపింపబడ్డాడనునదియే దానికి సరియైన జవాబు. ముందుగా ప్రవచింపబడిన సంఘటనలు నెరవేరుటలో మరొక జవాబు యేమీ లేదు.

9. భూమియొక్క వర్తులాకారాన్ని గూర్చి బైబిలు చెప్పిన దానినిబట్టి దానియొక్క దైవ ప్రేరణ పూర్తిగా నిరూపింపబడినది. 1543 సం॥లో భూమి గుండ్రముగా యున్నదని, అది తన యిరుసుపై గుండ్రముగా తిరుగుచున్నదనే కోపర్నికస్ సిద్ధాంతము వెలువడింది.

అట్టి దానిని గూర్చి మానవుడు కలలోకూడ ఊహించక కొన్ని వందల సంవత్సరముల ముందే, "శూన్య మండలముపైని ఉత్తర దిక్కునను్న ఆకాశ విశాలమును ఆయన పరచెను. శూన్యముపైని భూమిని వ్రేలాడ చేసెను" అని దేవుడు చెప్పాడు (యోబు 26:7). భూమినిగూర్చి దీని కంటె శ్రేష్ఠమైన వర్ణనను ఏ శాస్త్రజ్ఞుడు ఎన్నడు ఇయ్యలేదు. "ఆయన భూమండలము (Circle) మీద ఆసీనుడై యున్నాడు" అని యెషయా చెప్పాడు (యెషయా 40:22). ఆ కాలములో ఏ మానవుడు భూమండలమునుగూర్చి చెప్పలేకపోయాడు, ఏలయనగా భూమి బల్ల పరుపుగా నుండెనని ఆనాటి మానవుడు భావించాడు. యేసు తన రెండవ రాకడను గూర్చి చెబుతు ఆయన పగటివేళ, రాత్రివేళ వచ్చునని చెప్పాడు (లూకా 17:31-34). చాల కాలముమట్టుకు యిదొక క్లిష్టమైన వాక్యభాగముగా నుండెను; యేసు పగటివేళ, రాత్రివేళ ఒకేసారి ఎట్లు వచ్చునో యని మానవులు ఆలోచించేవారు. బైబిలు శత్రువులైతే అదొక స్వవిరుద్ధ సంగతియని వాదించారు. అయితే భూమికొక భాగాన్న పగలైతే మరొక భాగాన్న రాత్రియని మానవులు తెలిసికొన్న తరువాత ఆ వాక్యభాగము తేలికయై పోయింది. గనుక యేసు వచ్చినప్పుడు ఆయన రాత్రి వేళను, పగటివేళను వచ్చును. మానవుడిట్టి కలలు కనక వందలకొలది సంవత్సరముల ముందే ఈ సత్యము బైబిలులో ఉంచబడింది. దానిని గూర్చి మనమెట్లు లెక్క చెప్పగలము? దానికి ఒకేఒక్క జవాబున్నది: ఆ లేఖకుడు ఒక ఉన్నతుడైన శక్తిచే నడిపించబడ్డాడు.

10. క్రీస్తునుగూర్చిన బైబిలు సత్యములను జోసిఫస్ ధృవీకరించు చున్నాడు: "ఆ దినములలో, ఆయన నొక మానవుడని పిలుచుట సమంజసమైతే, యేసు అను నొక జ్ఞాని యుండెను. ఆయన ఆశ్చర్య కార్యములు చేసేవాడు; సత్యమును సంతోషముతో అంగీకరించేవారికి బోధకుడు. ఆయన తనయొద్దకు అనేక యూదులను అనేక అన్యజను

లను ఆకర్షించుకొన్నాడు. ఆయనే క్రీస్తు. మాలో ప్రముఖుల సలహా ననుసరించి పిలాతు ఆయనకు సిలువ శిక్ష విధించినప్పుడు, ఆయనను మొదట ప్రేమించిన వారాయనను విసర్జించలేదు; ఏలయనగా మూడవ దినమున ఆయన వారికి సజీవుడుగా కనబడ్డాడు. దేవుని ప్రవక్తలు దీనినిగూర్చి, మరి ఆయనను గూర్చిన పదివేల సంగతులనుగూర్చి ముందుగా చెప్పినట్లే అది జరిగెను. ఆయననుబట్టి క్రైస్తవులనబడిన తెగవారు నేటికిని నాశనము కాకుండా యున్నారు" (Book 18, Chapter 3).

ఈ ప్రఖ్యాత చరిత్రకారుడు క్రీ॥ శ॥ 37 నుండి 100వ సంవత్సరముల కాలములో జీవించాడు. అందువలన క్రీస్తును గూర్చి చెప్పబడిన అనేక సంగతులను పరిశోధించడానికి అతనికి కావలసినంత తరుణం లభించినది. అతడొక క్రైస్తవుడు కాడు. అందువలన క్రైస్తవ్యము యొక్క ఆరోపణలను ధృవీకరించుట కతడు ప్రయత్నించలేదు. అతడొక చరిత్రకారుడు. అతడు కనుగొన్న రీతిగానే చరిత్రను రికార్డు చేసాడు. క్రీస్తు జీవించాడని జోసిఫస్ చెప్పాడు. ఆయనను మానవుడని పిలుచుట సమంజసమైతే ఆయన ఒక జ్ఞానియని, ఆశ్చర్య కార్యములు చేసెనని, పిలాతు ఆయనను సిలువ వేయబడుట కప్పగించాడని, ఆయన మూడవ దినమున లేచి తన శిష్యుల కగుపడ్డాడని అతడు చెప్పాడు. అందువలన ఒక పురాతన, క్రైస్తవేతర చరిత్రకారుని వ్రాతలు క్రొత్త నిబంధనను ధృవీకరించుచున్నవి.

**11.** ఏ మానవుడు దానిని అభివృద్ధి చేయలేడు గనుక బైబిలు దైవప్రేరిత గ్రంథమని మేము నమ్ముదుము. మానవుని క్రియలన్నియు అభివృద్ధి చేయబడవచ్చును. విజ్ఞాన శాస్త్రములోను, పరిశ్రమలలోను, విద్యలోను, అన్ని రంగములలోను తేబడిన అభివృద్ధిని ఆలోచించుము. సవరింపబడిన వాటికొరకు పాతపుస్తకాలు విసర్జించబడ్డాయి. అయితే పంతొమ్మిదివందల సంవత్సరముల క్రితము ముగించ

బడిన గ్రంథము ఇప్పటి కింకను ప్రపంచములో గొప్పగా అమ్ముడగు చునే యున్నది. ఇంచుమించు అన్ని గృహాలలో అది కనబడుచున్నది. దాని మాటలు కోట్లకొలది ప్రజల పెదవులపై యున్నవి. "పారంపర్యము దానికొక గోతిని త్రవ్వింది, అసహనము దానివలన అనేక పుల్లలకట్టలను మండించింది, యూదాలాంటి వారనేకులు ఒక ముద్దుతో దాన్ని అప్పగించేసారు, పేతురులాంటి వారనేకులు ఒట్టు పెట్టుకొంటూ దాన్ని కాదన్నారు, దేమాలాంటి వారనేకులు దాన్ని విసర్జించారు, గాని దేవుని వాక్యము ఇంకా నిలిచియున్నది". ఏ మానవుడు దానిని అభివృద్ధి చేయలేకపోయాడు, దానికంటే శ్రేష్టమైన బైబిలును మనకియ్యలేక పోయాడు. ఇది వింత కాదా? కానేకాదు! అది దైవలేఖకునిచే వ్రాయబడింది.

—లీరోయ్ బ్రౌన్లో.

---

ఆమె నారి యనబడును-8

## సంఘానికి నేనేమి చేయగలను?

## *(What can I do for the Church?)*

ప్రభువు సంఘములో స్త్రీలు చేయడానికి ఏ పనీ లేనట్లు కొన్నిసార్లు కనబడతాది. ఏలయనగా బహిరంగ కూటాలలో పురుషులే నాయకత్వం వహించాలి. "స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని, ఉపదేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను" అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (1 తిమోతి 2:11, 12). అందువలన స్త్రీలు ఆరాధనకు వెళ్ళి అందులో పాల్గొనడమే వారి విధి యని చాలమంది స్త్రీలు తలస్తారు. అయితే మన పని అక్కడితో అంతమైపోతుందా?

కాదు, నిజానికి దేవుని నారాధించడం క్రైస్తవునికున్న తరుణం. అది అతని పరిచర్య కాదు, పనిగాని కాదు. మనము దేవుని స్తుతించే తరుణాన్ని, ఆరాధననుండి ఆత్మీయ బలాన్ని సహోదరుల సహవాసమును పొందే తరుణము కలిగియున్నాము. అయితే వారమంతటిలోను మనం చేసే దేవుని పని కొనసాగుచునే యుంటాది.

"...ఆ స్త్రీలు...సువార్త పనిలో నాతోకూడ ప్రయాసపడినవారు గనుక వారికి సహాయము చేయుమని నిన్ను వేడుకొనుచున్నాను" అని ఫిలిప్పీ 4:3లో వ్రాయబడియున్నది. రోమా 16:1-3లో ఇట్లు వ్రాయబడి యున్నది: "కెంక్రేయలో ఉన్న సంఘ పరిచారకురాలగు ఫీబే అను మన సహోదరిని గూర్చి...మీకు సిఫారసు చేయుచున్నాను; ఆమె అనేకులకును నాకును సహాయురాలై యుండెను. క్రీస్తు యేసునందు నా జత పనివారైన ప్రిస్కిల్లకును, అకులకును నా వందనములు చెప్పుడి, వారు నా ప్రాణముకొరకు తమ ప్రాణములను ఇచ్చుటకైనను తెగించిరి". "మీకొరకు బహుగా ప్రయాసపడిన మరియకు వందనములు" అని 6వ వచనములో యున్నది. లూదియ క్రైస్తవురాలైనప్పుడు పౌలుకు అతనితో ప్రయాణము చేయుచున్న వారికి తన గృహాన్ని నిలయంగా యిచ్చింది (అపొ.కా. 16:14, 15). ప్రిస్కిల్ల అకులయను దంపతులు అపొల్లోను చేర్చుకొని దేవుని మార్గము మరి పూర్తిగా అతనికి విశదపరచిరి (అపొ.కా. 18:26). అపొ.కా. 9:39లో మనము దొర్కా యను ఒక క్రైస్తవ స్త్రీని గూర్చి చదువగలము. ఆమె బ్రదికియున్నప్పుడు తన పరియాలోని విధవరాండ్రకు అంగీలు, వస్త్రములు కుట్టేది. వృద్ధ స్త్రీలు యౌవన స్త్రీలకు బోధించాలని తీతు 2:3, 4లో వ్రాయబడి యున్నది. యౌవనస్థుడైన తిమోతికి లేఖనములు బోధించుటలో అతని అవ్వయైన లోయి, అతని తల్లియైన యునీకే సఫలులైరి (2 తిమో 1:5). యేసును వెంబడించి ఆయనకు పరిచారము చేసిన మగ్దలేనే మరియ, చిన్న

యాకోబు యోసే అను వారి తల్లియైన మరియు, సలోమే అను వారిని గూర్చి మార్కు 15:40, 41లో మనకు కనబడుచున్నది.

గనుక మొదటి శతాబ్దపు స్త్రీలు ఆసక్తికలిగిన క్రైస్తవులు. దేవుని సంతోషపెట్టాలంటే ఈనాడు మనముకూడ ఆసక్తికలిగి యుండాలి. సంఘ పనిలో స్త్రీలు ఎట్లు సహాయపడగలరు? ఈ దిగువ కొన్ని సలహాలియ్యబడినవి :

1. నీవు, నీ కుటుంబము ఆరాధనకు ఎల్లప్పుడు హాజరయ్యే లాగ చూచుకోవాలి.

2. ఆత్మీయంగా నీ బిడ్డలకు యింటిలోనే శిక్షణ నిచ్చుటకు మరచిపోవద్దు.

3. బైబిలు స్టడీ సమయంలో చిన్నపిల్లలకు లేదా స్త్రీలకు ఉపదేశించుటకు ప్రయత్నించు.

4. ప్రభువురాత్రి భోజనాన్ని సిద్ధపరచడానికి ఆరాధన సమయం కంటే ముందు వచ్చుటకు ప్రయత్నించు.

5. ఆరాధన అయిపోయిన తరువాత ఆయా పాత్రలు, స్థలము శుభ్రపరచుటకు సహాయపడుము.

6. రోగులను దర్శించుటకు, ఆరాధనకు రాలేని వారిని దర్శించుటకు, స్త్రీల కూటముల నేర్పరచి నడపుటకు, అనారోగ్యముగాయున్న సభ్యులకు సహాయపడుటకు మిగతా స్త్రీలతో కలసి సమయాన్ని కేటాయించుకో.

7. నీ మిత్రులను, పొరుగువారిని మీ యింటిలో జరిగే బైబిలు స్టడీ కూటానికి ఆహ్వానించు.

8. క్రీస్తు సంఘాన్ని గూర్చి ఆసక్తి వెలిబుచ్చిన వారి యిండ్లలో బైబిలు స్టడీని జరిపించుటకు నీ భర్తతో సహకరించు.

నిజానికి సంఘానికి పనిచేయువారిలో స్త్రీల శక్తి ఎక్కువ. మన తరుణాలను వినియోగిస్తే సంఘముతో మనముకూడ ఆత్మీయంగా ఎదుగగలము.

—బెట్టీ ఫోటా.

---

సంక్షిప్త ప్రసంగము :-

## క్రైస్తవ శిష్యత్వ మూల్యము

I ఉపోద్ఘాతము :-

A. భావము : గ్రీకులో "మేథటెస్" – గురువు వద్ద నేర్చుకొను వాడు, హత్తుకొనువాడు, అనుకరించువాడు.

B. పాత నిబంధనలోని శిష్యత్వము : ఏలీయా - ఎలీషా.

C. క్రొత్త నిబంధనలోని శిష్యత్వము : యోహాను - శిష్యులు; మోషే - పరిసయ్యులు, యేసు - అపొస్తలులు.
మత్తయి 9:4, 10:1-4; యోహాను 1:35-37, 9:28.

D. గొప్ప ఆజ్ఞ లేక క్రీస్తు ప్రణాళిక - మత్తయి 28:18-19.

II సందేశము :- శిష్యుడు చెల్లించవలసిన మూల్యము.

A. తన్ను తాను ఉపేక్షించుకొనవలెను : మత్తయి 16:24.

1. దేవునికంటే కుటుంబ సభ్యులను ఎక్కువగా ప్రేమించరాదు. (లూకా 14:25-26; మత్తయి 10:31).

2. తనకు కలిగినదంతయు విడిచిపెట్టవలెను. (లూకా 14:33, ఫిలిప్పీ 3:5-15, మత్తయి 19:25-29).

B. శిష్యుడు తన సిలువ నెత్తుకొని వెంబడించవలెను : మత్తయి 16:24; లూకా 14:27.

1. శిలువ అనగా : శ్రమ, హింస, నింద, దూషణ మొదలగునవి అపో.కార్య 16:1-5, 2 తిమో 3:10-12.

2. శ్రమల ఉద్దేశము: క్రీస్తు సారూప్యములోనికి మార్చ బడుటకు.

C. శిష్యత్వపు తగులుబడి: లూకా 14:25-33.

1. గోపురము కట్టువాడు.

2. యుద్ధమునకు నీవు రాజు.

D. శిష్యుడు - నేర్చుకొనువాడు: యోహాను 8:31.

1. మూలోపదేశములు: హెబ్రీ 6:1-3.

2. సంపూర్ణతలో సాగించు బలమైన ఆహారము: హెబ్రీ 6:1-3.

III ముగింపు: హెచ్చరికలు.

A. క్రీస్తు, శిష్యులుగానున్న క్రైస్తవులకు:

B. క్రీస్తును ఇంకను అంగీకరించని వారికి:

C. క్రీస్తును ప్రకటించు సువార్తికులకు:

—B. జాషువా, ఏలూరు.

## విశాఖ బైబిల్ లెక్చర్‌షిప్

1986 జనవరి 23,24 మరియు 25 తేదీలలో హోటల్ అప్సరా కిన్నరా ఆడిటోరియమ్ విశాఖపట్నంలో బైబిలు లెక్చర్‌షిప్ జరిగియున్నది. ఈ బైబిల్ లెక్చర్‌షిప్ అనుకున్నదానికంటే వెయ్యి రెట్లు బాగుగా జరగడం ఆనందదాయకం. రాష్ట్రం నలుమూలలు నుండి ఇతర రాష్ట్రములునుండి విదేశాలనుండి విదేశీ సహోదరులు రావటం ఊహింపశక్యంకాని సహవాసం. ఈ లెక్చర్‌షిప్‌లో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ తమ స్వంతఖర్చులతో హాజరవ్వడం విశేషం. మొట్టమొదటి రోజున అనగా 23వ తేదిన "ఆత్మానుసారముగా నడుచుటకు దేవుడు మనలను పిలుచున్నాడు" (గలతీ 5:25,26) అనే అంశంపై ఉదయం సహోదరులు కె. జీవానందం (అనకాపల్లి) సహోదరులు పి. ప్రకాశం (హైదరాబాద్) మాట్లాడగా మధ్యాహ్నం సహోదరులు.

J. C. బెయిలీ (కెనడా) పాల్ గూటం (గొల్లవిల్లి) సాయంకాలం ఎమ్.జె. బాలసుందర, "ఆత్మను సారముగా జీవించుటకు దేవుడు మనలను పిలుచుచున్నాడు" (గలతి 5:13-18) అనే అంశంపై మాట్లాడడం జరిగియున్నది. అనంతరం సహోదరులు జె. బి. ట్రోటర్ చెప్పిన సలహాలు పరిశాం ప్రతీ క్రీస్తుసంఘ ప్రీచర్ నడుచుకుంటే 'క్రీస్తుసంఘం' మరు శాఖల్ని పెకలించగలదు.

రెండవరోజు ఉదయం "క్రీస్తువంటి మనస్తత్వము కలిగియుండు టకు దేవుడు మనలను పిలుచుచున్నాడు" (ఫిలిప్పీ 2:1-13) అనే అంశంపై సహోదరులు నెహెమ్యా గూటంగారు ఆ తరువాత సహోదరులు యు. ఇశ్రాయేలు (రాచపూడి) మాట్లాడడం జరిగింది. విశేషమేమిటంటే ఒకే వేదికపై ఒకే అంశంమీద 'గురు-శిష్యులు' ఒకరి తరువాత మరొకరు మాట్లాడడం. మధ్యాహ్నం సహోదరులు ఎ. వినయానంద్ (అనకాపల్లి) చక్కటి వాక్యాన్ని అందించారు అనంతరము సహోదరులు చుక్కా ఇస్సాకుగారి ప్రసంగం సాగింది. ఇకపోతే అదేరోజు సాయంకాలం "క్రైస్తవ శిష్యత్వ మూల్యము" (మత్తయి 16:21-24) అనే అంశంపై సహోదరులు బి. జాషువా (ఏలూరు) సహోదరులు ఆర్.సి.హెచ్. సద్గుణరావు (శ్రీకాకుళము) మాట్లాడడం జరిగింది.

ఇక చివరిరోజు అనగా 25వ తేదీన "స్వాభావికత, లేక వ్యక్తిత్వం కోల్పోకుండా భిన్నత్వంలో ఏకత్వం కలిగియుండుట" (ఎఫెసీ 4) అనే అంశంపై సహోదరులు కే. జి. కుమార్ (కాకినాడ) ఎన్. జాన్ (పిఠాపురం) మాట్లాడియున్నారు.

మూడు రోజులు బైబిల్ లెక్చర్‌షిప్‌లోను చక్కటి పాటలతో ఆకట్టుకున్న తుమ్మపాల క్రీస్తుసంఘ సహోదరి సహోదరులకు ఎనలేని ప్రశంసలు. మొట్టమొదటినుండి చివరి వరకు అత్యంత శ్రద్ధాశక్తులతో ఈ బైబిల్ లెక్చర్‌షిప్‌ను ఘనంగా, దిగ్విజయంగా నడిపించిన సహోదరులు జాషువా గూటం గారిని ఎంతైనా అభినందించవలసిందే. ★

—I. ఇశ్రాయేలు, కాకినాడ.

# "ఒక్క నిమిషం"

## ( *Just a Minute* )

మీకో నిమిషం ఉన్నదా ? దయచేసి దీనిని చదువండి.

నిమిషం అంటే యేమిటి ? అది 60 సెకండ్లు. అంత స్వల్ప కాలంలో నీవేమి చేయగలవు ? దాన్ని గూర్చి ఆలోచించడం అనవసరంకాదు.

ఒక్క నిమిషంలో భూతలమునుండి రోదసీలోనికి రాకెట్టు ద్వారా మానవుడు ప్రవేశించగలడు. T.V.లో చూచే అడ్వర్టయిజ మెంటు ఒక్క-నిమిషంలో ఏడ్పించగలదు, లేదా కడుపుబ్బనట్లు నవ్వించగలదు. ఫుట్‌బాల్ ఆట ఆఖరి నిమిషంలో ఓడిపోవచ్చును లేదా గెలువ వచ్చును.

నిమిషకాలం విలువైనది. 1984లో జరిగిన ఒలింపిక్ క్రీడల సమయంలో టి. వి.లో అడ్వర్టయిజు చేయడానికి ఒక్క నిమిషానికి 0 వేల డాలర్లు ఖర్చయ్యేది. ప్రమాద స్థలానికి అంబులెన్సుగాని, అగ్నిమాపక దళంగాని ఒక్క నిమిషం ముందు వెనుకలలో వస్తే అది చావు బ్రతుకుల మధ్యనున్నంత వ్యత్యాసం గలిగినదౌతాది. సమయమును పోనీయక సద్వినియోగము చేసికొనుచు జ్ఞానులవలె నడచుకొనవలెనని మనకు బోధింపబడింది (ఎఫెసీ 5:16). ఏలయనగా సమయము బహు విలువైనది.

నిమిషకాలంలో గొప్ప సంగతులు చేయవచ్చును. ఈ కొద్ది సెకండ్లలో మారుమనస్సు పొందిన వ్యక్తి ముందుకు రావచ్చును. తన విశ్వాసము నొప్పుకొని బాప్తిస్మము పొందవచ్చును. క్రైస్తవుడు నిమిషకాలంలో గొప్ప సంగతులు చేయవచ్చును. నిరుత్సాహంలో యున్న వారిని ప్రోత్సహించవచ్చును. 23వ దావీదు కీర్తన, ప్రభువు ప్రార్థన, ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక మొదలగునవి ఒక్క-నిమిషంలో చదివేయవచ్చును. 60 సెకండ్లలో నీకుటుంబాన్ని ఎంత ప్రేమించుచున్నావో చెప్పగలవు. మారుమనస్సు పొందిన వ్యక్తిని కౌగలించుకొనగలవు.

ఒక్క నిమిషంలో, నీతో ఆరాధనకు వచ్చునట్లు మరొకరిని ఆహ్వానించ గలవు. ఆరాధనకు వచ్చిన క్రొత్తవారికి ఒక్క నిమిషంలో స్వాగతం చెప్పగలవు. నీ సంతోషాన్ని పాటతోను, ప్రేమను బహుమతితోను, ఓపికను చిరునవ్వుతోను ఒక్క నిమిషంలో చూపించగలవు.

మన సమయం చాలమట్టుకు దుర్వినియోగ పరచబడుచున్నది. "నీవు జీవమును ప్రేమించుచున్నావా? అయితే సమయాన్ని వ్యర్థపరచకు; ఏలయనగా జీవితం దానితోనే తయారయ్యింది" అని బెంజమిన్ ఫ్రాంక్లిన్ చెప్పాడు. "పగలున్నంత వరకు నన్ను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను; రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడు పని చేయలేడని" చెప్పుచు యేసుక్రీస్తు సమయాన్ని జ్ఞానయుక్తముగా వినియోగించాడు (యోహాను 9:4).

క్రైస్తవులుగా మీ నిమిషాలను సద్వినియోగం చేయండి. గంటలు వాటికవే బాగుపడతాయి. ఈ వ్యాసాన్ని చదివినందుకు మీకు నా వందనాలు; దీన్ని చదవడానికి ఒక్క నిమిషమే పట్టింది!!

—డెన్నిస్ డౌటీ.

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

..............................................

..............................................

..............................................

..............................................